# మూన్నాళ్ళ ముచ్చట

"ఫస్టు తారీఖు వచ్చింది."

"ఆఁ అదిగో కాలెండరు."

"అది కాదండీ ... మరి...తప్పకుండా తెస్తారుకదూ" అంది రాధ తములపాకులు అందిస్తూ.

"ఓ యస్, తప్పకుండానూ, దేవిగారు సెలవివ్వటం నేను తేకపోవడమూనా? లేకపోతే...అమ్మో ఇంకేమేనా వుందా?" అన్నాడు చలపతి.

"చాలెద్దురూ వేళాకోళాలూ మీరూనూ"అంటూ కోటు అందించింది రాధ.

"మర్చిపోకండేం?" రాధ హెచ్చరించింది చలపతి రికార్డులు సైకిలు కారియరుకు కట్టుకుంటూవుంటే.

"చిత్తం" అంటూ నవ్వితే సొట్టపడే-రాధ బుగ్గపైన చిటిక వేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు చలపతి.

రాధకి ఆ రోజు ఏ పని చేయటానికీ తోచలేదు. మనస్సంతా చలపతిమీదవుంది, ఎప్పుడు సాయంత్రమవుతుందా? ఎప్పుడు ఆయన వస్తారా అని. ఆ వేళ వుదయమే ఇద్దరూ ఇంటి బడ్జెటు తయారుచేసేరు. అన్నీ లెక్కచూడగా మిగిలింది సరీగ్గా తను కొనమన్నదానికి సరిపోయింది. తప్పకుండా అందులోనే మంచిరకం వస్తుంది అనుకుంది రాధ.

ఎల్లాగయితేనేం సాయంత్రం అయిందయింది. "అమ్మయ్య వచ్చారా? తప్పకుండా తెచ్చారన్నమాటే, ఏం రంగు? ఎంతిలో కుదిరింది?" అంటూ ప్రశ్న పరంపరలు కురిపిస్తూ చిరునవ్వు మొహంతో చలపతికి ఎదురువెళ్ళింది రాధ. ఆ క్షణంలోనే ఆమె బుగ్గలమీది సొట్టలూ, చలపతి మనస్సులోని హుషారూ ఒక్కసారిగా మాయమయ్యేయి.

"ఏం తేలేదూ" అంటూ చలపతి వట్టి చేతులు చూచి చిన్నబుచ్చుకుంది రాధ.

చలపతి లేని నవ్వు తెచ్చిపెట్టుకుని "ఇదిగో, చూడు రాధా, ఇవాళే నారాయణ అప్పు అడిగేడు అర్జంటుగా పాతిక రూపాయలివ్వాల్సి వచ్చింది" అంటూ నేరస్థుడి పోజులో ఉపక్రమించేడు.

"పోనెండి మీరెప్పుడూ యింతే, ఎంత కాలంనించో ముచ్చటపడ్డాను పువ్వులచీర కొనుక్కుందామని. ఈ మొహానికి ఆ అదృష్టంకూడానూ" అంటూ కన్నీళ్లు తెరవాయిగా వంటింట్లోకి వెళ్ళిపోయింది రాధ.

"నీకు ఎంతచెప్పినా అర్థమవదు. ఆ పాతిక వాడికివ్వకపోతే వాడి ఉద్యోగం ఆఖరు. ఎంతో ప్రాణంమీదికి వస్తే తప్ప వాడసలు అడగనే అడగడు. వచ్చేనెలలో తప్పకుండా కొనిపెట్తానుకదూ" అంటూ చిరునవ్వుతో రాధ చెయ్యి పట్టుకున్నాడు చలపతి.

"అబ్బ వదలండి, సంతోషించారు తమ ప్రతాపానికి. క్రితంనెల తెస్తానన్నారు. అది కొత్తకోటుకి అయిపోయింది. ఈ సారి ఆపద్ధర్మం. వచ్చేనెల యింకోటి వస్తుంది. ఇష్టంలేకపోతే లేదని చెప్పకూడదూ? ఎందు

## నిట్టల శ్రీరామమూర్తి

కి పూరించడాలు" అంటూ చెయ్యి విదుల్చుకుంది రాధ.

"అదిగో అప్పుడే వచ్చేసేయి బుల్లి కోపాలు. వచ్చేనెల తప్పకుండా తెస్తానన్నానుకదూ" అంటూ రాధకి నవ్వు తెప్పించడానికి ప్రయత్నించేడు చలపతి.

ప్రక్కింటి రేడియోలోంచి వినిపిస్తోంది "కోపమేల రాధా..."

"అలమారులోవుంది కాఫీ ఫ్లాస్కు" అని విసుగ్గా పెరట్లోకి వెళ్ళిపోయింది రాధ.

చలపతికి చిరాకువేసింది. "తను ఎంత చెప్పినా అర్థం చేసుకోలేదే? ఈ ఆడవాళ్ళంతా ఇంతే. తమకి తోచిందకాని ఇవతల వాళ్ళ సంగతీ సందర్భమూ గ్రహించరు" అంటూ విసుక్కున్నాడు ఇంతలో "ఆడువారి మాటలకీ అర్థాలే వేరులే" అని పాడుకుంటూ వీధిలోంచి గెంతుకుంటూ వచ్చేడు గోపి "ఛీ వెధవా అవతలకి పో" అని చలపతి కేకపెట్టేసరికి వాడు హడలిపోయి బిక్కమొహం పెట్టి "అమ్మా నేనేం చేసేనే" అంటూ తల్లి దగ్గిరికి పారిపోయేడు.

రాధకి ఎంతో ఉడుకుమోత్తనం వచ్చింది. అడక్క అడక్క ఎన్నాళ్ళకో అడిగింది ఓచీర కొనిపెట్టమని. "ఏదో వంక పెట్టి ఇల్లాగే కాలయాపన చేస్తారు. ఈ మగాళ్లు అంతా ఇంతే. ఏదో అడిగింది కదా తెద్దాము అన్న సరదాలేదు. మళ్ళీ ఇంట్లో చాకిరికీ, అన్నిటికి తను కావాలి. ఈ మగాళ్లంతా వట్టి స్వార్థపరులు" అనుకుంది రాధ.

ఆవేళ రాత్రి ఇద్దరూ మాట్లాడుకోలేదు. కారు హారన్ లా బుంగ మొహం పెట్టింది రాధ. చిల్లుపడిన రబ్బరు బంతిని నొక్కినట్లుగా ముడుచుకుపోయింది చలపతి మొహం. మౌనంగానే అన్నం వడ్డించింది రాధ. చలపతి కిక్కురు మనకుండా మారు అడక్కుండా తినేసి వెళ్ళిపోయాడు.

......మర్నాడు......

పొద్దున్నే రాధ లేచింది. "చిట్టీ నాన్నగారికి యిచ్చిరా" అని కూతురు ద్వారా పంపింది కాఫీ. ఉదయానికి వాతావరణం కాస్త చల్లబడుతుందేమో అని అనుకున్న చలపతి చిట్టి చేతిలో కాఫీగ్లాసు చూసి తనూ బిగిసేడు. ఆ వుదయం పదిగంటలదాకా ఆఫీసు కాయితాలు తెగరాసేస్తున్నాడు చలపతి మధ్య మధ్యని చెంబులూ, తప్పేలాలూ బ్రహ్మాండమైన చప్పుళ్లతో క్రిందపడుతూండడమూ, "పదేళ్లు దాటుతున్నాయి ఇవతల చెంబు అవతల పెట్టలేవు" అని చిట్టినీ, "ఎనిమిదేళ్లు వచ్చినా ఇంకా ఓనమాలేనా రావు" అని గోపి గాడినీ రాధ కసరడమూ, వాళ్లు 'నాన్నా నాన్నా' అంటూ వీధి గది కేసి దృష్టి సారించి ఏడవటమూ, చలపతి ఆఫీసుపనికి అంతరాయం కలిగించేయి ఈ ప్రమాదకర పరిస్థితుల్లో తనేమేనా అంటే శ్రుతి మించి రాగాన్ని పడుతుంది వ్యవహారం అని చలపతి తనలో తనే సమాధానపడి మళ్లీ వ్రాతపనిలో మునిగిపోయాడు.

పదీ కాగానే చిట్టి సీరియసుగా మొహం పెట్టి "అమ్మ వడించింది నాన్నా" అంది. కిమ్మనకుండా రెండు మెతుకులు నోట్లో వేసుకుని భోజనం అయిందనిపించాడు చలపతి పప్పులో వుప్పు యెక్కువైనా, కూర అంతా కారంగుంపె అయినా కిక్కురు మనకుండా తినేసి వక్కపలుకులు మాత్రం నోట్లో వేసుకుని ఆఫీసుకి చక్కాపోయాడు.

"ఏం? తనకింత పట్టుదలేం? మళ్ళా ఓసారి సామరస్యంతో మాట్లాడితే కొంప

మునిగిపోయిందా? ఎందుకో అంత గర్వం?" అనుకుంది రాధ.

"ఈ ఆడవాళ్ళతో వున్న చిక్కే యిది. వాళ్ళు ఏం అనుకుంటే అది నోట్లో మాట నోట్లోవుండగా అయిపోవాలంటారు. ఇంత స్వల్ప విషయానికి అంత రుసరుస లెందుకు? ఆమాత్రం సహకారం లేకపోతే సంసారం ఎల్లా నడుస్తుంది?" అనుకున్నాడు చలపతి

ఆ రోజల్లా ఒకరితో ఒకరికి మాటలు లేవు. చలపతి కోపం అంతా ఆఫీసు ఫైల్సు మీదా, బంట్రోతు వెంకన్న మీదా చూపించాడు రాధ కోపం అంతా గోపి గాడిమీదా, చిట్టిమీదా, పోపు డబ్బాల మీదా ప్రసరించింది రెండో రోజు గడిచి పోతోంది. కాపరానికి రాధ వచ్చిందిలగాయతు అంతవరకూ ఇద్దరూ అలిగింగా ఎప్పుడూ వుండలేదు.

ఆరోజు సాయంత్రం చలపతి ఆఫీసు నుంచి రాగానే ధుమధుమలాడుతూ కోటు అదీ విప్పేసి, కాఫీయేనా త్రాగకుండా వీధి అరుగుమీద చిట్టినీ గోపినీ దగ్గరగా కూర్చో బెట్టుకుని, మొహం సీరియసుగా పెట్టుకుని కబుర్లు సాగించేడు.

రాధకి చలపతి మొహం చూసేసరికి నవ్వు వచ్చింది వచ్చే నవ్వుని అణచి పెట్టుకుని తండ్రీ పిల్లల ధోరణి చూస్తూ వీధి గుమ్మందగ్గర నిలబడింది "చిట్టీ కాఫీ పట్టుకెళ్ళి ఇయ్యవే" అంది మెల్లిగా చిట్టి లేవబోతూంటే "ఒసే చిట్టీ లేవకు" అని గదమాయించేడు చలపతి చిట్టి నిస్సహాయంగా తండ్రి వళ్ళో కూర్చునిపోయింది చలపతి మెడచుట్టూ చేతులు వెనవేసి వీపుమీద వేళ్ళాడుతూన్న గోపి "అమ్మా నాన్నకి కాఫీ వొద్దుటే. మాకిచ్చెయ్ అక్కా నేనూ తాగుతాం" అన్నాడు. రాధ లోపలికి వెళ్ళిపోయింది.

"అదీ నిజమే, ఆయన సాయపడకపోతే ఆ స్నేహితుడు ఏమైపోయేవాడు? అతని భార్యాపిల్లలూ ఎంత బాధపడివుండేవారు? తమకే ఆ అవస్థ వచ్చిన వాడు!" రాధకి తను పొరపాటు చేసినట్లు అనిపించింది. "నిజంగా తన భర్త ఎంతో వుదాత్తమైన పని చేసేరు. ఆ ప్రథమ కోపంలో తనకి వివేకం లేకపోయింది" ఒక్కసారి ఆయన పలకరిస్తే బాగుండు ననుకుంది రాధ. ఆ రాత్రి కూడా ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే వున్నారు.

చలపతికి రాధనిచూస్తే జాలి వేసింది. "అవును పాపం. చాలాకాలంనించి మురిపించేను చీరకొంటానని. ఎంతో ఆశపడింది. కాపరానికి వచ్చిన ఇన్నాళ్ళకి మొదటిసారిగా అడిగింది" నిద్ర పోతూన్న రాధ సౌందర్యంచూసి దగ్గరగా తీసుకుందామనుకున్నాడు. "ఉహూ, ఆడదానికి అంత అహంభావమూ బెట్టుసరీ వున్నప్పుడు తనకి మాత్రం వుండదూ?" రాధ పలకరిస్తే బాగుండును అనుకున్నాడు చలపతి

...ఆ మర్నాడు....ఆదివారం. చలపతి వీధి గదిలో కుర్చీలో కూర్చుని న్యూస్ పేపరు చూస్తున్నాడు. రాధ గుమ్మం దగ్గర చాప వేసుకుని కూర్చొని వార పత్రిక చూస్తోంది ఇద్దరి చూపులూ చదువుతూన్నట్టున్నా పేజీలుమాత్రం కదలటంలేదు. మనస్సులు ఒకదానివైపు ఒకటి ప్రయాణం చేస్తున్నాయి చిట్టి గోపీ ఆడుకుంటున్నారు

"చిట్టక్కా నువ్వు అమ్మవి నేను నాన్ననిఆట్లాడుకుందామా?"అన్నాడుగోపీ

చిట్టి తల వూపింది.

"ఏయ్ అన్నం పెట్టు" అన్నాడు గోపీ దర్జాగా పీటవేసినట్టు వేసుకుని కూర్చుని చిట్టి. వుత్తిత్తి వడ్డనలు చేసింది. గోపి తినేస్తున్నాడు.

"కూర ఇంకొంచెం వెయ్యనా" అంది చిట్టి.

"అబ్బ కూరనిండా వుప్పే వంట ఏం బాగాలేదు"అని లేచిపోయాడుగోపీ'విస్తరి' వదిలి.

"పోనీలే" అంది చిట్టి జాలిగా.

"నువ్విలా వండితే నీకు చీరా అదీ ఏం కొని పెడను చూసుకో" అన్నాడు గోపీ

ఫక్కుమని నవ్వారు రాధా చలపతీ ఒక్కసారిగా. ఆ నవ్వుతో ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. న్యూస్ పేపరూ వారపత్రికా తమ తమ యజమానుల చేతుల్లోంచి జారి క్రిందపడి ఒకదానొకటి పరామర్శించుకుంటున్నాయి మంచు కరిగినట్టు కరిగిపోయింది అంతటి మభావమూ. ప్రక్కింటి రేడియోలోంచి వినిపిస్తోంది... వాతావరణ సూచన ... "వాతావరణం బాగానే వుంటుంది." ★

